# సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023






## అంజన్నకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## పెద్దింట్లమ్మ హుండీ లెక్కింపు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం హుండీలను మంగళవారం లెక్కించారు. 88 రోజులకు రూ.9,65,992 ఆదాయం వచ్చింది.

## బంగారు పుష్పాల పూజ



జంగారెడ్డిగూడెం: పారిజాతగిరి వెంకటేశ్వరస్వామికి 108 బంగారు పుష్పాలతో పాద పద్మారాధన పూజ నిర్వహించారు. అలాగే ఆరాధన, తోమాలసేవ నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### ప్రత్యేక హోదాతోనే యువతకు భవిత



భీమవరం చేరుకున్న విభజన హామీల సాధన సమితి సమర యాత్ర

సాక్షి, భీమవరం : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించుకుంటేనే యువతకు భవిష్యత్ అని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం యువజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అనంతపురంలో చేపట్టిన సమరయాత్ర బస్సు మంగళవారం భీమవరం చేరిన సందర్భంగా కేశవరావు మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన సభలో మాట్లాడారు. విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విద్య వైద్య సంస్థల సాధనకు యువకులు విద్యార్థులు రోడెక్కి ఉద్యమిస్తే తప్ప ప్రత్యేక హోదా సాధ్యం కాదన్నారు. సమరయాత్రకు ఆటంకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీకి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అప్పల స్వామి, లంకా గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

### 2, 3 తేదీల్లో సైన్స్ ఎగ్జిబిషన్

సాక్షి, భీమవరం: జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల సైన్స్ ఎగ్జిబిషన్ ఈ నెల 2,3 తేదీల్లో భీమవరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి వీఎంజెడ్ శ్యామ్‌ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక చింతలపాటి బాపిరాజు స్మారక పాఠశాలలో 1న రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు.

# 5.50 లక్షల ఎకరాల భూమి రీ సర్వే

## కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడి



ఆకివీడు మండలం కొత్తచెరువు ప్రాంతంలో రీ సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ పి.ప్రశాంతి

ఆకివీడు: జగనన్న సంపూర్ణ భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో రీ సర్వే చేసేందుకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. మండలంలోని చినమిల్లిపాడు శివారు కొత్త చెరువు ప్రాంతంలో గ్రౌండ్ కంట్రోల్ పాయింట్(సర్వే రాయి)ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంపూర్ణ భూహక్కు రీ సర్వే కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరుగుతుందని చెప్పారు. సరిహద్దు వివాదాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ముందుగా రీ సర్వే పూర్తి చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఆకివీడు, కాళ్ల మండలాల్లో డ్రోన్ సర్వేను వేగవంతం చేయాలన్నారు. ముందుగా ఆకివీడు మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల జిల్లా అధికారి కె.జాషువాను ఆదేశించారు. ఆకివీడు మండలంలో 15 గ్రామాల్లో 2,9971.29 ఎకరాల భూమి రీ సర్వే చేయాల్సి ఉందని, దానిలో ఇంతవరకూ మూడు గ్రామాల్లో 492.46 ఎకరాల భూమి రీ సర్వే చేయించామని కలెక్టర్ చెప్పారు. కాళ్ల మండలంలో 13 గ్రామాల్లో 3,6561.69 ఎకరాలు రీ సర్వే చేయాల్సి ఉండగా 2 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయిందన్నారు. గ్రామాల్లో సర్వే చేస్తున్న సమయానికి ముందుగా గ్రామస్తులందరికీ సర్వే గురించి తెలియజేయాలని కలెక్టర్ సర్వే అధికారులను ఆదేశించారు.

**పీహెచ్‌సీ వైద్యులపై ఆగ్రహం**

మండలంలోని పెదకాపవరం గ్రామంలో పీహెచ్‌సీని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రెగ్యులర్ డాక్టర్ సెలవులో ఉండటం, ఇన్‌చార్జి డాక్టర్ విధులకు రాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరు డాక్టర్లు సెలవులో ఉంటే ఓపీ ఎవరు చూస్తారని ప్రశ్నించారు. ప్రతీ రోజూ రోగులు ఎంత మంది వస్తున్నారు, డెలివరీ కేసులు ఎన్ని వస్తున్నాయి, వాటిలో ఫ్రీ డెలివరీ కేసులెన్ని అని సిబ్బందిని ప్రశ్నించారు. ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని గ్రామాల్లో విస్తరింపజేయాలని కలెక్టర్ హెచ్చరించారు. తొలుత గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాడు–నేడు పనుల్ని పరిశీలించారు. ఫేస్–2లో పాఠశాలలో జరగుతున్న పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. స్కూల్‌లోని ల్యాబ్‌ను పరిశీలించి, ఇటీవల పంపిణీ చేసిన ట్యాబ్‌లను ఏవిధంగా ఉపయోగిస్తున్నారని విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కతారి జయలక్ష్మి, సర్పంచ్‌లు ఊసల బేబీ స్నేతు, ఎస్.రామరాజు, డీఈఓ వెంకటరమణ, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్, ఎంఈఓ రవీంద్ర, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు కేఎల్ యూనివర్సిటీ విద్యా సెమినార్

పాలకొల్లు సెంట్రల్: కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ సెమినార్ ఫిబ్రవరి 1న పాలకొల్లులో నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు. పాలకొల్లులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించే ఈ సెమినార్‌లో మేనేజ్‌మెంట్, ఆర్ట్స్ అండ్ సైన్స్ (నాన్ ఇంజనీరింగ్ కోర్సులు) విభాగాలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకూ నిర్వహించే సెమినార్‌కు జిల్లాలో ఆయా కళాశాల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

## తణుకు కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

తణుకు టౌన్: తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాక్ ఏ గ్రేడ్ సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సవరించిన నిబంధనల ప్రకారం ఈనెల 23, 24 తేదీల్లో నాక్ బృందం రాష్ట్రంలోనే మొదటి సారిగా తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తనిఖీలు నిర్వహించింది.

నాక్ బృందం తనిఖీల అనంతరం కళాశాలలోని పరిస్థితులను అంచనా వేసి 3.18 మార్కులతో ఏ గ్రేడ్‌ను ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. తమ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధికి, నాక్ ఏ గ్రేడ్ సాధించడంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రత్యేక కృషి చేశారని చెప్పారు. కళాశాల దాతలు, పారిశ్రామికవేత్తలు మల్లిన రామచంద్రరావు, చిలుకూరి రామకృష్ణ, చిట్టూరి నరేంద్ర, సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు బసవ రామకృష్ణ తదితరుల సహాయ, సహకారాలు అందాయని చెప్పారు.

## త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలి

### జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి



భీమవరం (ప్రకాశం చౌక్): పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారికి త్వరితగతిన రుణాల మంజూరుకు శ్రద్ధ వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి కోరారు. మంగళవారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి చిన్నా, పెద్దా తేడా లేకుండా సకాలంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ప్రమాదకరమైన 45 ఫ్యాక్టరీలను గుర్తించి ఇప్పటికే తనిఖీలు పూర్తి చేశామని చెప్పారు. ప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులపై ఫ్యాక్టరీ యాజమాన్యాలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సింగిల్ డెస్క్ విధానం ద్వారా డిసెంబర్ 29, 2022 నుంచి నేటి వరకు 11 దరఖాస్తులు అందగా వాటిలో 7 దరఖాస్తులకు ఇప్పటికే అనుమతులు మంజూరు చేశామని పరిశ్రమల శాఖ అధికారి తెలిపారు. పరిశ్రమల స్థాపనకు ఏఏ వర్గాల ప్రజలకు ఎంతెంత సబ్సిడీ వస్తుందో వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని డీఆర్వో సూచించారు. పీఎంఈజీపీ కింద 2022–23 ఆర్థిక సంవత్సరంలో 80 యూనిట్ల స్థాపన లక్ష్యంగా నిర్ణయించగా, 115 దరఖాస్తులను బ్యాంకు రుణాల మంజూరుకు పంపామని, వాటిలో 78 యూనిట్లకు రుణాలను మంజూరు చేశారన్నారు. 37 దరఖాస్తులు బ్యాంకు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. జగనన్న కాలనీల్లో ఎక్కువ గృహ నిర్మాణాలు చేపట్టవలసినచోట ఫ్లైయాష్ బ్రిక్ యూనిట్ల ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఉయ్యాల ఆదిశేషు, ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీపీ ఖాన్, ఏపీఐఐసీ జీఎం జి.కృష్ణ ప్రసాద్, ఏపీపీసీబీ ఈఈ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరిలో పోలీసు యాక్ట్ అమలు

సాక్షి, భీమవరం : జిల్లాలో ఫిబ్రవరి 1 నుంచి నెలాఖరు వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ యు.రవిప్రకాష్ చెప్పారు. పోలీస్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా ప్రజలు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించ రాదన్నారు. ఎవరైనా పోలీసు నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కడకట్లకు చెందిన కొరపాటి సుబ్బారావు సమాచార హక్కు చట్టం ద్వారా అవసరమైన వివిధ పత్రాలను అందించాలని తాడేపల్లిగూడెం మున్సిపల్ అధికారులను కోరారు. అయితే మున్సిపల్ కమిషనర్ వాటి వివరాలను వెల్లడించకపోవడంతో సుబ్బారావు రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన సహ చట్టం కమిషనర్ ఈ నెల 16న మున్సిపల్ కమిషనర్ స్వయంగా మంగళగిరి కార్యాలయానికి హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు.

## రెగ్యులర్ డీఈఓను నియమించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా విద్యాశాఖాధికారి పోస్టులో అర్హత లేని వ్యక్తులను నియమించడానికి జరుగుతున్న చర్యలను ఉపసంహరించుకుని రెగ్యులర్ విద్యాశాఖాధికారిని నియమించాలని వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు గెడ్డం సుధీర్ ఒక ప్రకటనలో కోరారు. ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పోస్టులో కనీసం బీఈడీ అర్హత కూడా లేని వ్యక్తిని నియమించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, సమగ్రశిక్ష అదనపు పథక సంచాలకుడు పోస్టుకు కూడా అర్హత లేని వ్యక్తిని నియమించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తల నేపథ్యంలో ఆ ప్రక్రియను విరమించుకోవాలని కోరారు. రెగ్యులర్ డీఈఓను జిల్లాకు నియమించాలని, లేని పక్షంలో ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డీ.మధుసూదనరావునే కొనసాగించాలని కోరారు.

## క్లుప్తంగా

### ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా

నలుగురి అరెస్టు.. 20 కేజీల గంజాయి స్వాధీనం



తనిఖీల్లో పట్టుకున్న గంజాయి


బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): ఆంధ్ర - తెలంగాణ సరిహద్దు జీలుగుమిల్లిలో ఆంధ్ర చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా రాజమండ్రి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా చేస్తున్న నలుగురు ప్రయాణికులు ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఈబీ సీఐ బి.మణికంఠరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భద్రాచలం నుంచి నలుగురు ప్రయాణికులు రాజమండ్రికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులో వచ్చారు. వారు రాజమండ్రికి బస్సులో వెళ్లి అక్కడి నుంచి రైలు ద్వారా తమిళనాడుకు వెళ్లనున్నారు. జీలుగుమిల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో భాగంగా బస్సులో ప్రయాణికుల లగేజీలను పరిశీలించగా, ఈ నలుగురు ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులలో సుమారు 20 కేజీలు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

# అందమైన చేతి రాత.. భవితకు బాట

- భాష ఏదైనా చేతి రాత బాగుంటే ఉజ్వల భవిత
- దస్తూరి సాధనపై విద్యార్థులు దృష్టి పెడితే మేలు
- పరీక్షల్లో మార్కుల పెరుగుదలకు దోహదం
- సమీపిస్తున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షలు

పెదవేగి: పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికే విద్యాశాఖ విడుదల చేసింది. మార్చి 15 నుంచి పది, ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అలాగే డిగ్రీ, వృత్తి విద్యా కోర్సుల వార్షిక పరీక్షలు మరికొద్ది నెలల్లో జరగనున్నాయి. విద్యార్థులు మార్కులు, గ్రేడులు సాధించడానికి ప్రణాళికలు రూపొందించుకుని అందుకు అనుగుణంగా సిద్ధమవుతున్నా... చేతి రాతను మాత్రం పట్టించుకోరు. దీంతో ఇచ్చిన ప్రశ్నలకు సరిగ్గానే సమాధానాలు రాసినా అనుకున్న మార్కులు పొందలేకపోతుంటారు. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతతో సాధన చేస్తే మంచి చేతి రాత సొంతమవుతుంది. ఏడాది పొడవునా చదివినా పాఠ్యాంశాలపై పరీక్షల్లో వచ్చే ప్రశ్నలకు విద్యార్థి అందంగా రాసే సమాధానాలపై ఎన్ని మార్కులు వస్తాయనేది ఆధారపడి ఉంటుంది.

**దస్తూరి అందంగా ఉంటే** మెచ్చుకోనివారుండరు. చేతిరాతను బట్టి కూడా మనస్తత్వాన్ని, గుణగణాలను కూడా అంచనా వేయవచ్చని నిపుణులు చెబుతారు. చేతిరాత అందంగా ఉంటే విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులను పొందే వీలుంటుంది. మార్చిలో ఇంటర్, ఏప్రిల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో చేతి రాతపై ఇప్పటి నుంచే దృష్టి సారించి సాధన చేస్తే ఇంకాస్త ఎక్కువ మార్కులను సాధించే అవకాశం ఉంది.




**నిత్యం సాధన అవసరం**

ఉమ్మడి పశ్చిగోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 73,128 మంది విద్యార్థులు ఈ ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. అలాగే 1,21,475 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. పుస్తకాలతో కుస్తీ పడుతూ పరీక్షలకు సన్నద్ధం అవుతూనే మరోవైపు రోజులో కొంత సమయం చేతిరాతపై దృష్టి సారిస్తే పట్టు వస్తుంది. రోజుకు అరగంటైనా చేతిరాతపై ప్రాక్టీస్ చేయాలి. ఈ విషయంలో తల్లి దండ్రులు దృష్టి సారించాలి.

**ఇవి పాటిస్తే.. ఇంకా మంచి స్కోరు**

ప్రతి విద్యార్థి జవాబు పత్రాల్లో సమాధానాలను స్పష్టంగా రాయాలి. పేపరుకు నాలుగు వైపులా బోర్డర్ వేసుకుంటే చూసేందుకు అందంగా ఉంటుంది. పరీక్షల్లో రాసే అక్షరాలు అన్నీ ఒకేలా ఉండాలి. అక్షరాలు మరీ పెద్దవి, చిన్నవిగా ఉండకూడదు. పేపరంతా ఒకే స్థాయిలో అక్షరాలు ఉండాలి. చేతిరాత బాగుంటే జవాబు పత్రాలను దిద్దే ఉపాధ్యాయుడు ప్రభావితమవుతారు. లైను లైనుకు మధ్య సెంటీమీటరు గ్యాప్ ఇవ్వాలి. అలాగే పదానికి, పదానికి తగినంత (ఒకటి లేదా రెండు అక్షరాలు) స్పేస్ ఇవ్వాలి. వాక్యాలు పైకి కిందకు లేకుండా వరుస క్రమంలో ఉండాలి. ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకోవాలి. లేకుంటే ఆ ప్రభావం చేతిరాతపై పడుతుంది.

### సాధనతోనే సాధ్యం

చక్కటి చేతిరాత సాధనతోనే సాధ్యమవుతుంది. పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందున సాధన కోసం సమయం కేటాయించుకోవాలి. అక్షరాలు అందంగా లేకపోతే మార్కులపై ప్రభావం పడుతుంది.



– సీహెచ్ జాబిల్లి, హెచ్ఎం, జెడ్పీ హైస్కూల్, భోగాపురం

### సందేహం లేదు

పరీక్షల్లో అందమైన చేతిరాతకు అదనపు మార్కులు పడతాయనడంలో సందేహం లేదు. చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకునేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం.



– సీహెచ్ ప్రసన్నాంజనేయులు, హెచ్ఎం, జెడ్పీ హైస్కూల్, కొప్పాక

### ప్రణాళికతో రాయాలి

సాధనతోనే చక్కటి చేతిరాత సాధ్యమవుతుంది. పరీక్షల్లో తొలి ప్రశ్న నుంచి చివరి ప్రశ్న వరకు సమాధానాలు గుండ్రంగా రాయాలంటే సాధన తప్పనిసరి. ప్రణాళికతో రాస్తే ఒత్తిడి ఉండదు.



– ఎంవీ సురేష్‌కుమార్ హెచ్ఎం, జెడ్పీ హైస్కూల్, కూచింపూడి

### భీమవరంలో చెస్ పోటీలు

ఏప్రిల్ 29, 30 తేదీల్లో నిర్వహణ



పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరంలో తొలిసారిగా ఇంటర్నేషనల్ ఫైడ్ రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు, చెస్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు తోట బోగయ్య, అధ్యక్షుడు మాదాసు కిషోర్ చెప్పారు. మంగళవారం టోర్నమెంట్ బ్రోచర్‌ను శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి కార్యదర్శి మెంటే పార్థసారథి ఆవిష్కరించిన సందర్భంగా వివరాలను విలేకరులకు వెల్లడించారు. అనసూయ చెస్ అకాడమీ, జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 29, 30 తేదీల్లో భీమవరం బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి గన్నాబత్తుల పెదతాత, తులసమ్మ కల్యాణ మండపంలో చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతులు అందిస్తామన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అనేక టోర్నమెంట్లు నిర్వహిస్తూ ఎంతో మంది క్రీడాకారులను జాతీయ స్థాయిలో ప్రోత్సహిస్తోందన్నారు. టోర్నీలో పాల్గొనేవారు 90632 24466 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. సేవా సమితి అధ్యక్షుడు కాగిత మహంకాళిరావు, ఉపాధ్యక్షుడు బండి సురేష్‌కుమార్, కోశాధికారి సమతం సత్యనారాయణమూర్తి, జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళీ పాల్గొన్నారు.



# శ్రీవారి ఆలయ భద్రతపై మరింత నిఘా

- దేవస్థానం, ఉప, దత్తత ఆలయాల్లో ఇప్పటికే 199 సీసీ కెమెరాలు
- మరో 100 కెమెరాల ఏర్పాటు చేయాలని అధికారులకు సూచన
- ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ వెల్లడి
- దర్శనం అనంతరం సీసీ కెమెరా మానిటరింగ్ రూమ్ పరిశీలన



శ్రీవారి దేవస్థానంలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ.

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ భద్రతకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చెప్పారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ కేవీఎస్ రాజు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం సీసీ కెమెరా మానిటరింగ్ రూమ్‌లో దేవస్థానం పరిసర ప్రాంతాలు, ఉప, దత్తత ఆలయాల వద్ద ఉన్న 196 సీసీ కెమెరాల పనితీరును ఎస్పీ గమనించారు. ఆ తరువాత స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ చినవెంకన్న ఆలయంలో 32, పరిసరాల్లో మరో 32 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయన్నారు. మిగిలినవి ఉప, దత్తత ఆలయాల వద్ద ఉన్నట్టు తెలిపారు. క్షేత్రంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో సీసీ కెమెరాల మానిటరింగ్‌ను తమ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు చెప్పారు. వీటి ద్వారా ఇప్పటికే పలు నేరాలను గుర్తించామన్నారు. పార్కింగ్ ప్రాంతాలతో పాటు, మరికొన్ని ముఖ్య ప్రదేశాల్లో మరో 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఇప్పటికే దేవస్థానం అధికారులకు సూచించామని, దీనిపై అధికారులు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అలాగే ఆలయ ఆవరణలోని పోలీస్ అవుట్ పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించామన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైమ్ రేటు బాగా తగ్గిందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్సై టి.సుధీర్ ఇప్పటికే పలు చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఎస్పీ వెంట భీమడోలు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై సుధీర్ తదితరులున్నారు.

## ఇంటింటికీ సంక్షేమం



కాళ్ల: పల్లిపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

# కట్టి కొట్టారనే కక్షతోనే హత్య



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, పక్కన సీఐ అంకబాబు, రూరల్ ఎస్సై రామకృష్ణ

నూజివీడు: మండలంలోని కొత్తూరు తండాకు చెందిన బాణావతు ఏసు (25)ని ఈ ఏడాది జనవరి 29వ తేదీన హత్య చేసి పరారైన నిందితుడు లావూరి యువరాజు (20)ను రూరల్ పోలీసులు అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఈ అశోక్‌కుమార్‌గౌడ్ చెప్పారు. నూజివీడులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. కొత్తూరు తండాకు చెందిన బాణావతు ఏసుకు, హటియా తండాకు చెందిన లావూరి యువరాజుకు మూడు నెలల క్రితం గొడవ జరిగింది. కొత్తూరు తండాకు చెందిన వలంటీర్ భూక్యా రాధిక మేనకోడలు వెన్నెల వోణీల ఫంక్షన్ జరగగా, ఈ కార్యక్రమంలో చిన్న గొడవ జరిగి యువరాజు.. భూక్యా రవిపై రాయి విసిరాడు. అతను తప్పుకోవడంతో మూడు కోటి అనే వ్యక్తి బీర్జాలకు రాయి తగలడంతో అతను స్పృహ తప్పిపడిపోయాడు. అప్పుడు అక్కడే ఉన్న బాణావతు ఏసు మరికొంతమందితో కలిసి యువరాజును గుంజకు కట్టి కొట్టారు. అప్పటి నుంచి ఏసుపై యువరాజు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో జనవరి 29వ తేదీ సాయంత్రం ఏసు, మూడు కోటి, యువరాజు హటియా తండా బస్టాపు వద్ద సిమెంట్ బెంచిపై కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఏసును గుట్కా ప్యాకెట్ అడిగినట్లు అడిగి యువరాజు అతనితో గొడవ పెట్టుకుని తన ప్యాంటు జేబులో సిద్ధంగా ఉంచుకున్న చాకుతో ఏసును పొడిచాడు. రెండు సార్లు గురి తప్పి ఎడమ బుజానికి తగలగా, మూడోసారి నేరుగా గుండెలపై పొడిచాడు. దీంతో ఏసు పైకి లేచి అక్కడి నుంచి కొంతదూరం నడిచి అక్కడికక్కడే కుప్పకూలిపోయి ప్రాణాలు వదిలాడు. ఈ ఘటన చూసిన స్థానికులు నిందితుడిని పట్టుకోవడానికి ప్రయత్నించగా, యువరాజు చాకును తీసుకుని పరారయ్యాడు. మృతుడి భార్య మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు డీఎస్పీ ఈ అశోక్‌కుమార్ గౌడ్ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలించారు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో అన్నవరం రోడ్డులోని బైపాస్ రోడ్డు అడ్డరోడ్డు వద్ద నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో పాటు అతని వద్ద ఉన్న హత్యకు ఉపయోగించిన చాకును స్వాధీనం చేసుకుని, నిందితుడు యువరాజును కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని డీఎస్పీ వివరించారు.

# గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు

భార్యాభర్తలకు తీవ్ర గాయాలు



గాయపడ్డ అంజయ్య



గాయపడ్డ దుర్గను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు



గ్యాస్ సిలిండర్ నుంచి వస్తున్న మంటలు

ద్వారకాతిరుమల: గ్యాస్ సిలిండర్ లీకై మంటలు ఎగసిపడటంతో ఇంట్లో వంట చేస్తున్న భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ద్వారకాతిరుమలలోని శివాలయానికి వెళ్లే ఘాట్ రోడ్డులో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఈడే అంజయ్య, దుర్గ దంపతులు కొత్త బస్టాండ్ ఎదురుగా మొబైల్ క్యాంటిన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు శివాలయానికి వెళ్లే ఘాట్‌రోడ్డులోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఉదయం ఇంటి వద్ద క్యాంటిన్‌కు సంబంధించిన వంటలు చేస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో అంజయ్య, దుర్గలకు కాళ్లు, చేతులు కాలి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులకు సపర్యలు చేసి, 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# అరటికి తెగుళ్ల బెడద




- తక్కువ ఉష్ణోగ్రత, అధిక తేమశాతంతో పంటపై ప్రభావం
- ఉమ్మడి జిల్లాలో ఉధృతంగా ఆకుమచ్చ, దుంపకుళ్లు తెగుళ్లు
- సకాలంలో నివారణ చర్యలతో అధిక దిగుబడులకు అవకాశం



జిల్లాలోని మెట్ట ప్రాంతంలో తెగులు సోకి రంగుమారిన అరటి చెట్టు

చింతలపూడి: అరటి ఉష్ణ మండలపు పంట. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 12,076 హెక్టార్లలో అరటి పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుత వాతావరణంలో ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులు, అధిక తేమశాతం ఉన్నందున అరటి పంటను ఆకుమచ్చ తెగులు, దుంపకుళ్ల తెగులు ఆశిస్తున్నాయి. ప్రస్తుతం 26 నుంచి 32 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా, 70 నుంచి 75 శాతం తేమ ఉంటోంది. వీటి ప్రభావంతో సిగటోక ఆకుమచ్చ తెగులు, పనామా దుంపకుళ్ల తెగులు, బాక్టీరియా దుంపకుళ్ల తెగులు ఉధృతంగా ఉన్నాయి. వీటి నివారణకు రైతులు తీసుకోవాల్సిన చర్యలను చింతలపూడి ఉద్యానశాఖాధికారి అమర్నాథ్ రైతులకు వివరిస్తున్నారు.

**సిగటోక ఆకుమచ్చ తెగులు**

ఈ తెగులు వర్షాకాలంలో జూలై నుంచి ఎక్కువగా ఉంటుంది. తెల్ల చక్కెరకేళి, పచ్చ అరటి, బొంత రకాలలో ఎక్కువగా కనిపిస్తుంది. ముందుగా కింది ఆకులపై చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడి క్రమేపీ పెరిగి మధ్యలో బూడిద రంగు కలిగి ఉంటాయి. ఈ మచ్చలు గోధుమరంగులోకి మారి పరిమాణంలో పెద్దవై ఒకదానితో ఒకటి కలసి పోయి ఆకు మొత్తం ఎండిపోతుంది.

**నివారణ చర్యలు**

నెల వ్యవధిలో నాలుగైదు సార్లు పిచికారీ చేసి తెగులు ఉధృతిని సమర్థవంతంగా అరికట్టవచ్చు. తెగులు మందులు కూడా మార్చిడి చేస్తూ పిచికారీ చేయాలి. మొదటి పిచికారీలో ప్రోపికొనజోల్ 1 మీ.లీ. మందును లీటర్ నీటితో, రెండో పిచికారీలో కార్బెండజిమ్, మాంకోజెబ్ మందుల మిశ్రమాన్ని 1 గ్రాము లీటర్ నీటితో, మూడో పిచికారీలో ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్, టేబుకొనజోల్ 1.5 గ్రాముల మందుల మిశ్రమాన్ని లీటర్ నీటితో, నాలుగో పిచికారీలో డైఫెనకొనజోల్ 1 మీ.లీ. మందును లీటర్ నీటికి కలిపి చల్లుకోవాలి.

**పనామా దుంపకుళ్ల తెగులు**

ఈ తెగులు నీటి వాహికలను ఆశించడం వల్ల కింది ఆకులు పసుపు బారి ఎండిపోయి వాలిపోతాయి.

నివారణ: తెగులు రహిత తోటల నుంచి మాత్రమే పిలకలు ఎంపిక చేసుకోవాలి. పిలకలను సుడోమోనాస్ లేదా మాంకోజెబ్ లేదా కార్బండిజమ్ ద్రావణంతో శుద్ధి చేసుకోవాలి. తెగులు ఎక్కువగా ఉన్న తోటలలో వరి పంట వంటి వాటితో పంట మార్పిడి చేసుకోవాలి.

**బాక్టీరియా దుంపకుళ్ల తెగులు**

ఈ తెగులు చక్కెరకేళి రకం పంటను ఎక్కువగా ఆశిస్తోంది. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు, చిన్న మొక్కలకు నీటి తడులు ఇచ్చినప్పుడు ఎక్కువగా వ్యాపిస్తుంది. భూమికి దగ్గర భాగంలో కాండం (దొప్పలు)పై కుళ్లుమచ్చలు ఏర్పడి క్రమేపీ దుంప కుళ్లి వాసన వస్తుంది. ఆకులు పసుపు రంగులోకి మారి బొందపై పగుళ్లు ఏర్పడి చిన్నపాటి గాలులకే చెట్టు/మొక్క పడిపోతుంది.

**నివారణ :** తెగులు ప్రాథమిక దశలో బ్లీచింగ్ పౌడర్ 25 గ్రాములను లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదలు తడిచేలా పొయ్యాలి. తెగులు ఎక్కువగా ఉన్నప్పుడూ కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ 3 గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి మొదలు తడిచేలా పొయ్యాలి. ఈ విధంగా ఉద్యాన అధికారుల సూచనలు పాటిస్తే తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవడమే కాక అధిక దిగుబడులు సాధించే అవకాశాలు ఉన్నాయి.



అమర్నాథ్, ఉద్యాన శాఖ అధికారి, చింతలపూడి సబ్ డివిజన్

### నేడు ఉమ్మడి జిల్లా హాకీ జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హాకీ జట్ల ఎంపిక పోటీలు బుధవారం ఏలూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శాప్ ఆదేశాల మేరకు శాప్ లీగ్స్ ఫేజ్–2 పోటీల్లో భాగంగా 19 ఏళ్ల లోపు బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని వివరించారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. మంగళవారం నాటికి 19 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈ నెల 3, 4 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. మరింత సమాచారం కోసం 99125 11244 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

### మృతదేహం లభ్యం

పెనుగొండ: రెండు రోజుల క్రితం అదృశ్యమైన జక్కంశెట్టివారి పాలెంకు చెందిన జక్కంశెట్టి నాగబాబు (22) మంగళవారం సిద్ధాంతం బ్రిడ్జి వద్ద గోదావరిలో మృతదేహమై తేలాడు. గ్రామంలో కనిపించకపోవడంతో నాగబాబుకు కోసం వెతుకుతుండగా సిద్ధాంతం బ్రిడ్జి సమీపంలో నాగబాబుకు చెందిన మోటార్ సైకిల్‌ను కనుగొనడంతో గోదావరిలో దూకి ఉంటాడన్న అనుమానంతో వెతుకుతున్నా ఆచూకీ లభించలేదు. చివరకు మంగళవారం బ్రిడ్జి సమీపంలో మృతదేహం తేలడంతో తల్లిదండ్రులు సూర్యనారాయణ, నాగలక్ష్మి,, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. ఎలక్ట్రిషియన్‌గా జీవనం సాగిస్తున్న నాగబాబు ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు తెలియకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పెనుగొండ ఎస్సై రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### డైరీ ఆవిష్కరణ



నూతన డైరీ ఆవిష్కరణ దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో నూతన డైరీ ఆవిష్కరణ పట్టణంలో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగింది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.శేఖర్‌బాబు, వైవీఎల్‌రావులు, కోశాధికారి నాగేంద్రబాబులు డైరీని సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఈసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### భద్రత అందరి బాధ్యత



తణుకు పట్టణంలో అవగాహన కల్పిస్తున్న సీఐ సత్యనారాయణ

**తణుకు:** రహదారి భద్రత అందరి బాధ్యతని తణుకు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తణుకు పట్టణంలోని స్థానిక పాలిటెక్నిక్ కళాశాల వద్ద వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని కోరారు. మోటారు సైకిల్‌పై ప్రయాణించే వారు కచ్చితంగా హెల్మెట్ వినియోగించాలని సీఐ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 30 మందికి ఉచిత వైద్యసేవలు



సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

**తణుకు అర్బన్:** సజ్జాపురం సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో డా. బి.రమేష్‌చంద్రబాబు, డా.పుల్లెపు సత్యనారాయణలు హాజరైన 30 మంది రోగులకు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, తణుకు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర ప్రసాదరావు, కోసూరి గాంధీ, కోశాధికారి అడ్డాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### డప్పు కళాకారులను ఆదుకోవాలి



డప్పు కళాకారులను ఆదుకోవాలంటూ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**పెంటపాడు:** ఈనెల 8న ఏపీ డప్పు కళాకారుల సంఘ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఏపీ డప్పు కళాకారుల సంఘ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు కోరారు. ఈ సందర్భంగా పెంటపాడులో డప్పు కళాకారుల సంఘ సమావేశం నిర్వహించి వారి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఈనెల 8న పాలకొల్లులో డప్పు కళాకారుల సంఘ సదస్సును కళాకారులంతా విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం కరపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దిద్దే నాగేశ్వరావు, ఎస్ నాగేశ్వరరావు, దిద్దే ప్లీడర్, మల్లిపూడి జయరాజు, కన్నెపాముల దావీదు, కంకిపాటి క్రాంతికుమార్, కొండేటి నరేష్, తదితరులు ఉన్నారు.

### జంతు వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

**ఆకివీడు:** జంతువుల వ్యాధులపై నిర్లక్ష్యం వహిస్తే అవి మనుషులకు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కె.జనార్దన్ హెచ్చరించారు. జంతు సంక్షేమ పక్షోత్సవం సందర్భంగా అయిభీమవరంలో పశువులకు, కుక్కలకు వ్యాధినిరోధక టీకాలు మంగళవారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోరులేని జీవాలకు వచ్చే వ్యాధుల్ని గుర్తించి నివారణా చర్యలు చేపట్టాలన్నారు. కుక్కల ద్వారా వచ్చే రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైనదని చెప్పారు. పెంపుడు కుక్కలతో పాటు ఇతర కుక్కలకు కూడా రేబిస్ నివారణ టీకాలు వేయించాలని సూచించారు. జంతువులపై ప్రేమగా ఉండాలని, వాటిని హింసిస్తే చట్టరీత్యా నేరమని జనార్దన్ చెప్పారు. కార్యక్రమంలో వైద్యురాలు కె.భార్గవీ సత్య, స్థానికులు పాల్గొన్నారు.

# దళారీ వ్యవస్థను రూపుమాపిన ఘనత జగన్‌దే

**తణుకు టౌన్:** రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో రాష్ట్రంలో మొదటి సారిగా దళారి వ్యవస్థను రూపుమాపి రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు ధరను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావులకు దక్కుతుందని మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ చెప్పారు. మంగళవారం తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద రైతులు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన దాన్యానికి రైతులకే పూర్తి మద్దతు పొందాలనే లక్ష్యంతో ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా ధాన్యం కొనుగోలు చేశారని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే రైతుల బ్యాంక్ ఖాతాలలో డబ్బులు జమ చేయడంతో పాటు ధాన్యం సంచులు, హమాలీ, రవాణా చార్జీలను కూడా రైతుల ఖాతాల్లోనే జమ చేయడం రైతులకు ఎంతో మేలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుల చిత్రపటాలకు రైతులు, నాయకులు పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, గ్రామ ఉప సర్పంచ్ కోట నాగేశ్వరరావు, మండల రైతు విభాగం ప్రధాన కార్యదర్శి సరెళ్ల కృపావరం, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరమళ్ల ఫణీంద్ర, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ పొట్ల సురేష్, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, దారం శ్రీను, గ్రామానికి చెందిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తేతలిలో సీఎం, మంత్రి కారుమూరి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు



ఏలేటిపాడులో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్నా రైతులు, నాయకులు

**సీఎం చిత్ర పటానికి రైతుల పాలాభిషేకం**

**ఇరగవరం:** రైతు బాంధవుడు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్నా నిర్ణయంతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని ఏలేటిపాడు సొసైటీ అధ్యక్షుడు సత్తిబాబు అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి, వెంటనే రైతుల అకౌంట్‌లో నేరుగా జమ చేయడం జరిగింది. గతంలో ఏ ముఖ్యమంత్రి రైతుల కోసం ఇన్ని చర్యలు తీసుకోలేదన్నారు. రైతులు విత్తనాలు వేసింది మొదలు ధాన్యం కొనుగోలు చేసే వరకు రైతుల కోసం పనిచేసే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని పేర్కొన్నారు. దళారి వ్యవస్థ లేకుండా వాళ్ల చేతిలో మోసపోకుండా చర్యలు తీసుకున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా కనీస మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసినందుకు, సకాలంలో నగదు చెల్లించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చొరవ, ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలు మేరకు ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసి అధికార యంత్రంగానికి ఆదేశాలు ఇస్తూ, ధాన్యం కొనుగోలులో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టరని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కొవ్వూరి శ్రీనివాస రెడ్డి (బాబు) , సత్తి సుధాకర్ రెడ్డి (సీఇవో), నల్లమిల్లి బాలకృష్ణ రెడ్డి, నల్ల మిల్లి శ్రీనివాస రెడ్డి, చిన్నం రామా రెడ్డి పాల్గొన్నారు.

## నేడు బలుసులమ్మ తల్లి కల్యాణ మండపం ప్రారంభం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** అత్యాధునిక సదుపాయాలతో బలుసులమ్మ అమ్మవారి ఆశీస్సులతో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉపముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన సూచనలు మేరకు నూతన కల్యాణ మండపాన్ని సన్నద్ధం చేశారు. వివాహం చేసుకునే జంటకు ఈ కల్యాణ మండపం ఎంతగానో ఉపయోగపడే విధంగాను 1500 మంది అతిథులతో వివాహం చేసుకునే విధంగా సెంట్రల్ ఏసీ, లిఫ్ట్, గెస్ట్ రూంలు, వంటశాల, మంచినీటి సౌకర్యం, గార్డెన్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కల్యాణ మండపం ఫిబ్రవరి 1వ తేదీన ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణంతో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. గతంలో దేవాదాయ శాఖ మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు హయాంలో ఈ మండపాన్ని నిర్మించారు. అసంపూర్తిగా ఉన్న ఈ మండపాన్ని నేడు పూర్తిస్థాయిలో, అన్ని రకాల హంగులతో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దారు.



బలుసులమ్మ ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన బలుసులమ్మ అమ్మవారి కల్యాణ మండపం

## చదరంగంతో విద్యార్థుల్లో మేధో వికాసం

**తణుకు టౌన్:** విద్యార్థుల్లో మేధో వికాసానికి చదరంగం క్రీడ దోహదం చేస్తుందని వాసవీ క్లబ్ గవర్నర్ కొర్లేపర కృష్ణాజీ చెప్పారు. మంగళవారం తణుకు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్, వాసవీ వనితా వైభవం, వాసవీ క్లబ్ రాయల్స్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన చదరంగం పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం ఆట ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు తెలివితేటలు పెరుగుతాయని చెప్పారు. ఈపోటీల్లో తణుకు పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నట్లు వాసవీ క్లబ్ నాయకులు తెలిపారు. ఈపోటీలకు చెస్ మాస్టర్ కే చరణ్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. క్లబ్ రీజియన్ చైర్మన్ మానేపల్లి వెంకట రమణ, జోన్ ఆఫీసర్ జీ రాజేశ్వరరావు, వనిత వైభవం క్లబ్ అధ్యక్షురాలు ఏ వేదకుమారి, కార్యదర్శి జే సుజాత, రాయల్స్ క్లబ్ అధ్యక్షుడు జే వీరభద్రయ్య, కార్యదర్శి కే చంద్రమౌళి గుప్తా, కోశాధికారి కే మురళీ, కేబినెట్ సభ్యులు, విద్యార్థినీ, విద్యార్థులు, పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



తణుకులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చదరంగం పోటీలను తిలకిస్తున్న దృశ్యం

## ఉపాధి హామీ పనులు చూపించాలి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** ఉపాధి హామీ పనులు చూపించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పేర్కొన్నారు. ఐద్వా జనరల్ బాడీ సమావేశం మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అల్లం పూర్ణిమ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఉపాధి పనులు లేకపోవడం వల్ల మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి హామీలో 100 రోజుల పనులు చూపించాలన్నారు. ధరలు పెరిగిపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. మహిళలపై అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఐద్వా సంఘం నిరంతరం మహిళల సమస్యలపై పోరాటం చేస్తుందని మహిళలందరు ఐక్యంగా కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, కార్యదర్శి యశోద, పద్మ, పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

**భీమవరం(ప్రకాశం చౌక్):** శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్సవ మహోత్సవాల్లో మంళవారం మధ్యాహ్నం 3 గంటలకు జగన్నాథపు వెంకటేశ్వర రావు ఉరదాలపాలెం వారితో భగవత్ పారాయణ, సాయంత్రం 4 గంటలకు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం భీమవరం వారితో ఆధ్యాత్మిక ప్రవచనం, సాయంత్రం 5 గంటలకు రాగరవళి సంగీత నృత్య కళాక్షేత్రం తణుకు వారితో కూచిపూడి నృత్యం, సాయంత్రం 6 గంటలకు ఎస్. భారతి భాగవతారిణి ఏలూరు వారితో హరికథ, రాత్రి 8 గంటలకు సోని ఆర్కెస్ట్రా భీమవరం వారితో సినీ సంగీత విభావరి అలరించాయి.

**అమ్మవారి ఉత్సవాల్లో నేడు**

శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్స ఉత్సవాల్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు భగవత్ పారాయణ కార్యక్రమంచేసినట్లు తెలిపారు.

## జగనన్న భూరక్షణ సర్వేకు రైతులు సహకరించాలి



తణుకులో భూముల రీసర్వేకు సంబంధించి క్షేత్ర స్థాయిలో రైతులతో చర్చిస్తున్న సర్వే అధికారులు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఇతర సిబ్బంది

**తణుకు టౌన్:** ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్షణ పథకంలో భాగంగా చేపట్టే సర్వేలో డ్రోన్ సర్వే చేయడానికి ముందే క్షేత్ర స్థాయిలో అధికారులు ముందుగానే ప్రతి సర్వే నెంబరు తనిఖీ చేసుకొని రిమార్కులతో సిద్ధంగా ఉండాలని నరసాపురం ఇన్‌స్పెక్టర్ సర్వే ఎంఆర్‌పీ బాబు చెప్పారు. మంగళవారం తణుకు పట్టణ పరిధిలోని వార్డు సచివాలయ సర్వే సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డ్రోన్ సర్వే పూర్తి అయితే రీసర్వేలో బాగమైన గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ చేయడం సులభమవుతుందని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పట్టణంలోని శివారు భూములకు చెందిన రైతులను కలసి వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె శ్రీనివాస్, వార్డు సచివాలయ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



తూర్పు విప్పర్రులో భూములు రీ సర్వే చేస్తున్న రెవిన్యూ సిబ్బంది

**తూర్పు విప్పర్రులో భూములు రీ సర్వే.........**

**ఇరగవరం:** మండలంలోని తూర్పు విప్పర్రు గ్రామంలో మంగళవారం రెవిన్యూ అధికారు భూముల రీ సర్వే లో భాగంగా ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ నిర్వహించారు. ఈ సర్వేతో భూ సమస్యలు పరిష్కారించబడతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో పరిమి రామ లింగేశ్వరరావు , గ్రామ సర్వేయర్ కిరణ్ కుమార్, వీఆర్‌ఏ బి ప్రసన్న కుమారి ,మాజీ సర్పంచ్ అకేటి నరసింహరావు, రైతులు కాకిలేటి శ్రీరాములు, పి శ్రీను పాల్గొన్నారు.

### రంగస్థల కళాకారుల సేవా కార్యక్రమాలు అభినందనీయం



రంగస్థల కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని గీతా మందిరం ప్రాంగణంలో మంగళవారం రాత్రి సంఘ సమావేశం నిర్వహించారు. సభాధ్యక్షుడిగా తాడేపల్లి మోహన్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సామాజిక సేవా పురస్కారం యోగా గురువు బడుగు చంద్రశేఖర్‌కు అందజేశారు. రంగస్థల నటికి పుట్టా సత్యవతికి ఆర్థిక సత్కారం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరింప జేసాయి. ఈ కార్యక్రమంలో సూరంపూడి వెంకట రమణ, చింతకాయల వంశీ, కవురు శారద, మాసా బాబూరావు, కె.నూకరాజు, బుల్లియ్య, బోణం వెంకట లక్ష్మి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కోడి పందేల స్థావరంపై దాడి

**భీమవరం అర్బన్:** భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం కోడి పందేల స్థావరం పై పోలీసులు దాడులు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం దిరుసుమర్రు గ్రామంలోని గొల్లగూడెంలో కోడి పందేలపై పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

## జగనన్న గృహాలు త్వరగా పూర్తి చేయాలి

**పెంటపాడు:**గృహాలు నిర్మించుకొనేందుకు లబ్ధిదారులు ఆశక్తి చూపాలని ఆర్డీవో దాసి రాజు పేర్కొన్నారు. పెంటపాడు మండలంలో వల్లూరుపల్లి, ఆకుతీతపాడు మౌంజీపాడు గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ప్రారంభించని ఎస్ఎస్‌లులో ఉన్న స్థలాలె సిమెంట్ లెవెల్‌కు వచ్చేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. మౌంజీపాడు, వల్లూరుపల్లి గ్రామాలలో లే అవుట్‌లు కోర్టు కేసుల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆకుతీగపాడులో ఇప్పటివరకు ఇళ్లు నిర్మించుకోక పోవడంపై స్థానిక అధికారులను నిలదీసారు. ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులతో ఆయన మాట్లాడి వారి సమస్యలు విన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఈఈ రమణ, డీఈ ప్రసాద్, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఏఈ రాజేంద్రప్రసాద్ వర్కుఇన్స్‌స్పెక్టర్‌లు జయరాజు, ప్రసాద్ ఆకుతీగపాడు సర్పంచ్ భావన ధాన్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడు మండలం వల్లూరుపల్లి గ్రామంలో ఇళ్ల స్థలాలు పరిశీలిస్తున్న ఆర్డీవో దాసిరాజు

## అందుబాటులో దాళ్వా సాగుకు అవసరమైన ఎరువులు

తణుకు టౌన్: జిల్లాలో దాళ్వా సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో వున్నాయని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు చెప్పారు. మంగళవారం తణుకు రూరల్ మండలంలోని వేల్పూరులోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లోని కియోస్కల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన సమస్త సేవలను పొందవచ్చని చెప్పారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచామని తెలిపారు. తణుకు మండలంలో 11,900 ఎకరాలలో దాళ్వా వరి నాట్లు వేసినట్లు తెలిపారు. రైతులందరూ ఈకేవైసీ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో కే కుసుమ, ఏఈవో టీ వీరభద్రుడు, వీఏఏ చర్మిష, రైతులు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

### గోస్తనీ నది తీర్థోత్సవాలు ప్రారంభం

**పాలకోడేరు:** మోగల్లులో గోస్తనీ నది 92వ తీర్థోత్సవాలను మంగళవారం వైభవంగా ప్రారంభించారు. తొలుత గ్రామంలోని ఆంజనేయ లక్ష్మణ సమేత సీతా రామచంద్ర మహారాజు, పద్మావతి సహిత వేంకటేశ్వర స్వామివారి ఆలయాల్లో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాలుగు బృందాలతో ఏకాహం నిర్వహించారు. సాయంత్రం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమాలను ఏఎస్ఆర్ సమితి, గోస్తనీ నది తీర్థోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

# స్పర్శలేని మచ్చల పట్ల అప్రమత్తంగా ఉండాలి



దువ్వలో కుష్టు వ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది



కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం దృశ్యం

**తణుకు టౌన్:** చర్మంపై వచ్చే స్పర్శలోని మచ్చలు, బుడిపెల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కుష్టు వ్యాధికి సంబంధించిన లక్షణాలని వాటిని మొదట్లోనే గుర్తిస్తే నివారించడం కష్టం కాదని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ డి త్రిమూర్తులు చెప్పారు. మంగళవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల వద్ద వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.టీఎల్ఎస్ హరిణి మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలు, గుర్తించడం, నివారణకు సంబంధించిన వివరాలను వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు కుష్టు వ్యాధి నివారణపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా కుష్టు వ్యాధి నివారణకు సంబంధించిన ప్రతిజ్ఞను వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లతో చేయించారు. ఈ కార్యక్రమంలో ఏ శ్రీరామమూర్తి, బీ దుర్గా కుమారి, లెప్రసీ నోడల్ అధికారి ఎంపీ వెంకట్రావు, పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**కుష్టు వ్యాధితో పోరాటం చేద్దాం**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** కుష్టు వ్యాధితో పోరాటం చేద్దామని, గత చరిత్రను మార్చేదామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. డా.వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం యాగర్లపల్లి 24,25 వార్డుల్లో వైద్యాధికారి డా.ఎస్ అమృత అధ్యక్షతన డీపీఎంఓ రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు జరిగాయి. అధికారులు మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైక్రో బాక్టీరియమ్ లెప్రే అనే బాక్టీరియా ద్వారా వస్తుందని, ఈ క్రిములు తుమ్మడం వల్ల నోటి తుంపరలు ద్వారా దగ్గడం వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుందని, వ్యాధి లక్షణాలు కన్పించడానికి సుమారు 3 నుంచి 5 సంవత్సరాలు సమయం పడుతుందని వెల్లడించారు. లక్షణాలు ఉంటే స్వీయ పరీక్ష, బహుళ ఔషధ చికిత్సతో పూర్తిగా కోలుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.